క్లుప్తంగా

పేద విద్యార్థినులకు ఆర్థిక సాయం



గన్నవరం: పేద విద్యార్థుల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని మానవత స్వచ్ఛంద సంస్థ గన్నవరం శాఖ చైర్మన్ మడుపల్లి బాలకృష్ణమూర్తి తెలిపారు. స్థానిక సంస్థ కార్యాలయంలో సూరంపల్లికి చెందిన ఇంటర్మీడియెట్ విద్యార్థినులు షేక్ షర్మిలకు రూ. 5 వేలు, శిలారపు వైష్ణవికి రూ.2 వేలు ఆర్థిక సాయం అందజేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన షేక్ రిజ్వానాకు రూ.3 వేల విలువైన నిత్యావసర సరుకులు, బియ్యం బస్తా అందజేశారు. సంస్థ కన్వీనర్ కర్రా వరప్రసాద్, అధ్యక్షుడు వీసం ప్రసాదరావు, కార్యదర్శి వీవీ. కృష్ణమోహన్, సంయుక్త కార్యదర్శి వడ్లమూడి వెంకటేశ్వరరావు, సభ్యులు షేక్ ఆదామ్ వలి, సయ్యద్ లాల్, సత్యప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా ఆరోగ్యమాత మహోత్సవాలు



పెనమలూరు: గంగూరు గ్రామంలో గత మూడు రోజులుగా ఆరోగ్యమాత మహోత్సవాలు కానూరు కార్మెల్ మాత విచారణ గురువు సలివేంద్రశౌరి ఆధ్వర్యంలో ఘనంగా చేశారు. ఈ ఉత్సవాలు ఈ నెల 6వ తేదీ నుంచి 8వ తేదీ రాత్రి వరకు ఘనంగా నిర్వహించారు. మొదటి రోజు సీటీసీ సిస్టర్స్ ఆరోగ్యమాత పతాకాన్ని ఆవిష్కరించారు. రెండవ రోజు సిస్టర్ జూయిసి ఆధ్వర్యంలో దివ్య ప్రసాదం, ఆరాధన, దివ్యబలిపూజ నిర్వహించారు. మూడవ రోజు ఆరోగ్యమాత ఊరేగింపు దివ్య బలి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఫాదర్లు అబ్బదాసరి రత్నరాజు, బండి జాకీమ్, దేవదానం, పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తి పాటలు ఆలపించారు.

పంచాయతీల ప్రగతికి సహకరించాలి



విజయవాడరూరల్: పంచాయతీలు ప్రగతి సాధించడానికి ప్రజాప్రతినిధులు సహకరించాలని ఎంపీడీఓ బి.విగ్గిన్స్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు, ఎంపీటీసీ సభ్యులకు పంచాయతి అచీవ్మెంట్ ఇండెక్స్‌పై శిక్షణ కార్యక్రమం జరిగింది. 9 అంశాలపై గ్రామ పంచాయతీలు ప్రణాళికలు తయారు చేసి వాటిని అమలు జరిగే విధంగా ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. సమావేశంలో కొత్తూరు తాడేపల్లి సర్పంచి ఉయ్యూరు గోపాలరావు, రామవరప్పాడు సర్పంచి శ్రీదేవి, పాతపాడు సర్పంచి దేవగిరి సుజాత, పి.నైనవరం సర్పంచి బట్టా సోమయ్య, ఎంపీటీసీ సభ్యులు విజయసుగుణ, పి.శ్రీనివాసరావు, బల్లెం సునీత, లక్ష్మి, వలి, రసూలు, శేఖర్, పలువురు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇస్లాంపేటలో సమస్యలు పరిష్కరించాలని వినతి

గన్నవరం: స్థానిక ఇస్లాంపేటలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచి నిడమర్తి సౌజన్యకు కాలనీవాసులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆమెకు అందజేశారు. కొంత కాలంగా ఇస్లాంపేటలో తాగునీటి సరఫరా సక్రమంగా జరగడం లేదన్నారు. దీనివల్ల నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతన్నామని చెప్పారు. ఇస్లాంపేటలో డ్రెయిన్లు పూడుకుపోయిన కారణంగా మురుగునీటి పారుదల కావడం లేదన్నారు. పందులు స్వైర విహారం చేస్తుండడంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నట్లు తెలిపారు. స్పందించిన సర్పంచి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



పెనమలూరు: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని పెనమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ బిజిలీ శ్రీనివాస్ అన్నారు. పీహెచ్‌సీలో మంగళవారం మహిళల ప్రత్యేక అవగాహన కల్పించారు. గర్భిణి అని తెలిసిన తరువాత బరువు 10-12 కేజీలు పెరగాలన్నారు. ఆకుకూరలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. వైద్యురాలు డాక్టర్ సాయిలలిత మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. టీటీ ఇంజెక్షన్‌లు సమయానికి తీసుకోవాలన్నారు.హెల్త్ వి జిటర్ నిర్మల, అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు శ్రీలత,ఎల్.సులోచనారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశలు, గర్భిణులు, తల్లులు పాల్గొన్నారు.

అన్నదాతల కన్నెర్ర

- కదంతొక్కిన అన్నదాతలు
- వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో అన్నదాత పోరు
- ఉయ్యూరు ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేత
- పెనమలూరు, పామర్రు నియోజకవర్గాల నుంచి పోటెత్తిన అన్నదాతలు



అన్నదాత పోరును ఉద్దేశించి ప్రసంగిస్తున్న పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి, పక్కన పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

కంకిపాడు/ఉయ్యూరు/ఉయ్యూరురూరల్: ఎరువుల కొరతపై అన్నదాతలు కదం తొక్కారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన 'అన్నదాత పోరు' ఆందోళనకు పెనమలూరు, పామర్రు నియోజకవర్గాల నుంచి రైతులు పోటెత్తారు. కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఆందోళన చేశారు.

వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు..

ప్రస్తుత సీజన్‌కు అవసరమైన యూరియా, ఎరువులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు పెనమలూరు, పామర్రు నియోజకవర్గాలకు చెందిన రైతులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు మంగళవారం ఉయ్యూరు ఆర్డీఓ కార్యాలయం వద్ద శాంతియుతంగా ఆందోళన చేశారు. ఉయ్యూరు బైపాస్ సెంటరు నుంచి పాదయాత్రగా మార్కెట్ యార్డుకు చేరుకున్న పార్టీ శ్రేణులు రైతులు యూరియా కొరతపై నిరసన గళం విప్పారు.

ఖాళీ యూరియా సంచులు పట్టుకొని..

ఖాళీ యూరియా సంచులు చేతబట్టి నిరసన వ్యక్తం చేశారు. పొలాలు అదునుతప్పక ముందే యూరియా, కాంప్లెక్సు ఎరువులు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పామర్రు మాజీ శాసన సభ్యుడు కైలే అనిల్‌కుమార్, పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి, రైతులు పార్టీ నేతలతో కలిసి ఆర్డీఓ కార్యాలయ ఏఓ రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు.

రైతుగోడు పట్టించుకోని కూటమి

– కైలే అనిల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే పామర్రు

కూటమి ప్రభుత్వం రైతుల గోడు పట్టించుకోవటం లేదని పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ విమర్శించారు. అన్నదాత పోరు ఆందోళనలో భాగంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ రెండు నెలలుగా యూరియా కొరతతో రైతులు అల్లాడుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఐదేళ్ల పాటు రైతులకు ఇబ్బంది లేని విధంగా విత్తనాలు, ఎరువులు సరఫరా అయ్యాయన్నారు. వైఎస్సార్ రైతులకు అండగా విధానాలు తీసుకొస్తే, వైఎస్‌జగన్ రైతు పక్షపాత పాలన సాగించారని గుర్తు చేశారు. యూరియా గురించి అడిగితే చంద్రబాబు బెదిరింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం సాగిస్తున్న మోసాలపై ప్రజలు తిరగబడే రోజులు ముందున్నాయన్నారు. లంకపల్లిలో రీసర్వే పేరుతో భూములను దోచుకునేందుకు కూటమి నేతలు కుట్ర చేస్తున్నారని విమర్శించారు. 600 ఎకరాలను కాజేసేందుకు కుట్ర జరుగుతుందని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. పామర్రు నియోజకవర్గంలో రోజుకు రూ.70 లక్షలు ఇసుక దోచేస్తున్నారని, ఆ సొమ్ము ఎవరి జేబులోకి వెళ్తుందని ప్రశ్నించారు. ఆఖరికి రేషన్ బియ్యంలోనూ ఎమ్మెల్యేలు కిలోకు రూ.4 వాటా తీసుకుంటున్నారని, అక్రమాలకు కూటమి నేతలు, ప్రజాప్రతినిధులు కేరఫ్ అయ్యారని ఆరోపించారు. చిత్తశుద్ధి ఉంటే అక్రమాలను నిలువరించాలని, రైతులకు యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

పాలన గాలికొదిలేసిన ప్రభుత్వం

– దేవభక్తుని చక్రవర్తి, పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త

ముఖ్యమంత్రి చంద్రబాబు రైతుల సమస్యలు పట్టించుకోవటం లేదని పార్టీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి దుయ్యబట్టారు. ఆయన మాట్లాడుతూ పాలన గాలికొదిలేసి ప్రచారంలో మునిగి తేలుతున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. కూటమి పాలనలో ఏ వర్గానికీ న్యాయం చేకూరలేదని, అన్ని వర్గాలూ ఇబ్బందులు పడుతున్నాయని విమర్శించారు. నియోజకవర్గంలో యూరియా కొరత, రైతుల ఇబ్బందులపై రెండు నెలలు ముందుగానే అధికారులకు వినతులు ఇచ్చామన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా నేడు సమస్య తీవ్రం అయ్యిందన్నారు. పెనమ లూరు నియోజకవర్గంలో జరుగుతున్న ఇసుక అక్రమ వ్యాపారంపై ఎప్పుడైనా చర్చకు సిద్ధమని, నిజాయితీ ఉంటే చర్చకు రావాలని డిమాండ్ చేశారు. రైతులు, ప్రజల పక్షాన పోరాటానికి వైఎస్సార్ సీపీ సిద్ధంగా ఉందని స్పష్టంచేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు బాకీ బాబు, రాజులపాటి పార్వతి, జొన్నల రామమోహన్‌రెడ్డి, ఎంపీపీ ఈడుపుగంటి రాజామణి, రాష్ట్ర పార్టీ నేతలు అన్నే వేణుగోపాల కృష్ణమూర్తి, జంపాన కొండలరావు, వల్లభనేని వెంకటేశ్వరరావు, రామినేని రమాదేవి, మందా శ్రీనివాసరెడ్డి, కనగాల హరిబాబు, నక్కా శ్రీను, ప్రతివాడ రాఘవరావు, నడకుదురు రాజేంద్ర, జిల్లా నేతలు గోన మదన్, రాజులపాటి రామచంద్రరావు, నత్తా వెంకటేశ్వరరావు, పాలడుగు శివజ్యోతి, బందెల సుబ్బారావు, మూల్పూరి శిరీష, బ్రహ్మానాయక్, తాడిశెట్టి శ్రీను, పోలిమెట్ల వంశీకృష్ణ, మోర్ల రామచంద్రరావు, దేవభక్తుని రాము, తిరుమలశెట్టి బోసుబాబు, నియోజకవర్గ నేతలు పిడికిటి రామకోటేశ్వరరావు, మాగంటి శ్రీనివాసరావు, నందిపాటి బిందుమాధవి, రమావత్ శ్రీకాంత్, ఊర నాగిన్, తారాచంద్, మండల, పట్టణపార్టీ బాధ్యులు అబు కలాం, దాసే రవి, కళ్లం వెంకటేశ్వరరెడ్డి, భీమవరపు నాగిరెడ్డి, టెక్కెం సతీష్, కాకర్ల వెంకటేశ్వరరావు, యలమంచిలి గణేష్‌బాబు, గోగం సురేష్, రాజులపాటి రాఘవరావు, కలపాల వజ్రాలు, కొండవీటి వెంకట సుబ్బారావు, బీహెచ్ రాజగోపాల్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, జి.పరమేశ్వరరావు, రవి, తోకల ఉమాదేవి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



ఉయ్యూరులో అన్నదాత పోరు ఆందోళనకు హాజరైన మహిళలు



ఉయ్యూరులో జగనన్న పోస్టర్లు ప్రదర్శిస్తున్న రైతులు

అన్నదాత పోరును డైవర్షన్ చేసేందుకే..



ఎస్.విజయసుగుణ

విజయవాడరూరల్: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో తలపెట్టిన 'అన్నదాత పోరు' కార్యక్రమాన్ని డైవర్షన్ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సర్పంచ్‌లకు, ఎంపీటీసీ సభ్యులకు పంచాయతీ అచీవ్మెంట్ ఇండెక్స్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారని వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యురాలు ఎస్.విజయసుగుణ (రామవరప్పాడు) అనుమానం వ్యక్తం చేశారు. అన్నదాత పోరు కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులను వెళ్లనీయకుండా చేయడానికి ఈ శిక్షణ కార్యక్రమం పెట్టినట్లు అనిపిస్తోందన్నారు. 40 మంది ఎంపీటీసీ సభ్యులున్న ఈ మండలంలో కేవలం ఏడుగురు ఎంపీటీసీలు, నలుగురు సర్పంచ్‌లు మాత్రమే శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారన్నారు. మరో ఆరు నెలల్లో గ్రామ సర్పంచ్‌లకు పదవీకాలం పూర్తయ్యే స్టేజ్‌లో ప్రభుత్వం శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడంలో అర్థంలేదనే అభిప్రాయాన్ని ఆమె వ్యక్తం చేశారు. 24 గంటల ముందు ప్రజాప్రతినిధులకు శిక్షణా కార్యక్రమం అంటూ అధికారులు సమాచారం పంపడం వెనుక వైఎస్సార్ సీపీ తలపెట్టిన అన్నదాత పోరు కార్యక్రమాన్ని నీరుకార్చే ప్రయత్నమేనని ఆమె విమర్శించారు.

18న వస్తువుల సరఫరా నిమిత్తం బహిరంగ వేలం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో ఈనెల 18న పలు వస్తువులు సరఫరా నిమిత్తం సీల్డ్ టెండరు/బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.ప్రియాంక మంగళవారం తెలిపారు. పూజా సామగ్రి, ప్రసాదము, అన్న ప్రసాదములకు సరుకులు సంవత్సర కాలం సరఫరాకై , అమ్మవారి నిత్యాలంకరణ, పూలదండలు, విడిపూలు, తమలపాకులు, అమ్మవారికి వస్త్రములు, శేష వస్త్రముల సప్లై నిమిత్తం నిర్దేశించిర ధరావత్తు సొమ్ము డీడీ రూపంలో చెల్లించి ఈనెల 17 లోపు సీల్డ్ టెండర్ సమర్పించాలన్నా రు. ఈ సీల్డ్ టెండర్లను ఈనెల 18న మధ్యాహ్నం 3 గంటలకు టెండర్ దారుల సమక్షంలో తెరిచి బహిరంగ వేలం నిర్వహిస్తామని వివరించారు. వివరాలకు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలి.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

పెనమలూరు: విజయవాడ- అవనిగడ్డ కరకట్ట రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు అయ్యాయి. పెదపులిపాకకు చెందిన రాఘవేంద్ర అనే వ్యక్తి బైక్‌పై వస్తుండగా పెదపులిపాక వద్ద ఎదురుగా వచ్చిన కారు అతనిని ఢీ కొట్టింది. అతని కాలు విరిగింది. స్థానికుల సహకారంతో బాధితుడిని 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

అనధికార భవనం కూల్చివేతను అడ్డుకున్నవారిపై కేసు



పోరంకిలో భవనం శ్లాబ్‌కూల్చుతున్న మున్సిపల్ సిబ్బంది

పెనమలూరు: పోరంకిలో అనధికార భవన నిర్మాణాన్ని మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారులు మంగళవారం కూల్చి వేయటానికి రంగంలోకి దిగారు. దీంతో బిల్డర్, మరి కొందరు వ్యక్తులు ఘర్షణకు దిగిన ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం పోరంకి మహాలక్ష్మినగర్‌లో ఉషాకీర్తి అనుమతులు పొంది జీ+2 భవన నిర్మాణం చేపట్టారు. అనుమతులకు విరుద్ధంగా అదనంగా మరో అంతస్తు నిర్మాణం చేయటంతో మున్సిపాలిటీ అధికారులు నోటీసులు ఇచ్చారు. బిల్డర్ సంతృప్తికరమైన సమాధినం ఇవ్వలేదు. దీంతో మున్సిపాలిటీ అధికారులు పోలీసు బందోబస్తుతో అనధికార కట్టడాన్ని కూల్చాడానికి వెళ్లారు. దీంతో బిల్డర్ తండ్రి మరీదు విష్ణునారాయణ, వి.రామ్‌ప్రసాద్, సతీష్, పవన్‌కుమార్, సంతోష్ అనే వ్యక్తులు కారులో వచ్చి మున్సిపాలిటీ అధికారులను, పోలీసులను అడ్డుకున్నారు. విష్ణునారాయణ కెమికల్ కలిపిన ఇంజెక్షన్‌తో పోలీసులు, మున్సిపాలిటీ సిబ్బందిపై దాడికి యత్నించాడు. భవనంపై ఉన్న మున్సిపాలిటీ సిబ్బందిపై దాడి చేశారు. ఈ ఘటనలో మున్సిపల్ ఉద్యోగి విజయరాజు చేతికి గాయం అయ్యింది. అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేయటంతో పై వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన



సంఘీభావం తెలుపుతున్న నేతలు

ఉంగుటూరు(గన్నవరం): ఉంగుటూరు తహసీల్దారు కార్యాలయం వద్ద మంగళవారం ఎలుకపాడుకు చెందిన బీ ఫారం పట్టాదారులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. వీరికి కౌలురైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీ.లక్ష్మణస్వామి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలుకపాడులోని 12 ఎకరాల ఎసైన్మెంట్ భూమిని వంద మంది పేదలకు పంపిణీ చేసి బీ ఫారం పట్టాలు పంపిణీ చేశారని చెప్పారు. వీరిలో కొంత మందికి మాత్రమే పట్టాదారు పాస్‌బుక్‌లు పంపిణీ చేశారన్నారు. మిగిలిన లబ్ధిదారులకు కూడా పాస్ బుక్‌లు పంపిణీ చేసి ఆన్‌లైన్ చేయాలని డిమాండ్ చేశారు. తద్వారా అన్నదాత సుఖీభవ తదితర పథకాలను వర్తింపజేయాలని చెప్పారు. వ్యవసాయ కార్మిక సంఘ నేతలు అజ్మీరా వెంకటేశ్వరరావు, బాధితులు యకోబు, ఇమ్మానుయేలు, సుగుణరావు, సరోజిని, మరియమ్మ, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయ సన్నిధిలో అన్నదానం



పెనమలూరు పీహెచ్‌సీలో అన్నదానం చేస్తున్న సత్యసాయి సేవాసమితి నిర్వాహకులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. స్వామి వారికి ప్రీతిపాత్రమైన మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి హనుమంతుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అభయాంజనేయునికి తమలపాకులతో ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి. ఆలయ ప్రాంగణంలో దాతలు మిట్టపల్లి వెంకట చలపతిరావు, పద్మ లలిత దంపతుల సహకారంతో 300 మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ ఈవో పీతాని తారకేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గర్భిణులకు అన్నదానం

పెనమలూరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం శ్రీ సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో వృద్ధులకు, గర్భిణులకు అన్నదానం చేశారు. పెనమలూరు శ్రీసత్యసాయి సేవాసమితి కన్వీనర్ మోహన్‌రావు మాట్లాడుతూ ప్రతి నెలా 9వ తేదీన మాతా శిశు సంక్షేమ నారాయణ సేవలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. వృద్ధులకు, గర్భిణులకు ఆహారం అందించటం వలన ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి సభ్యులు ఉయ్యూరు రమణమ్మ, అమ్మాజీ, వెంకటలక్ష్మి, సుజాత పలువురు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు సత్కారం



ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న డీవైఈఓ, ఎంపీడీఓ, ఎంఈఓ- 2

గన్నవరం: వృత్తి పట్ల అంకితభావంతో పని చేసే ఉపాధ్యాయులకు గుర్తింపు లభిస్తుందని గుడివాడ డివిజన్ ఉప విద్యాశాఖాధికారి కొండా రవికుమార్ తెలిపారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న మండలానికి చెందిన దొప్పల జ్యానేస్, రేమల్లి రత్నకుమారి, మడగాని సరళ, కొమెర కుమార్‌బాబును మండల విద్యాశాఖ తరుపున ఘనంగా సత్కరించారు. ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న ఎంపీడీఓ టి.స్వర్ణలతను సన్మానించారు. ఈ సందర్భంగా డీవైఈఓ మాట్లాడుతూ.. మండలం నుంచి నలుగురు ఉపాధ్యాయులకు జిల్లా స్థాయి అవార్డులు దక్కడం అభినందనీయమన్నారు. విద్యారంగానికి వీరు అందిస్తున్న సేవలను గుర్తించి ఈ అవార్డులకు ఎంపిక చేసినట్లు తెలిపారు. తోటి ఉపాధ్యాయులు వీరిని ఆదర్శంగా తీసుకుని మిగిలిన ఉపాధ్యాయులు కూడా చిత్తశుద్ధితో పనిచేసి జిల్లా, రాష్ట్ర స్థాయి అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. ఎంఈఓ- 2 ఎం. కమల, పలు పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉల్లాస్ వలంటీర్‌గా అనంతలక్ష్మి



హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం బొమ్ములూరుకు చెందిన డ్వాక్రా మహిళ గుళ్లపల్లి అనంతలక్ష్మి ఉత్తమ ఉల్లాస్ వలంటీర్‌గా కలెక్టర్ డీకే బాలాజీ నుంచి ప్రశంసాపత్రం స్వీకరించారు. గ్రామీణ మహిళల్లో నిరాక్షరాస్యతను నిర్మూలించేందుకు చేస్తున్న కృషికి గానూ ఈ పురస్కారం దక్కింది. వయోజన విద్య ద్వారా చదవటం, రాయటం నేర్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఉల్లాస్ కార్యక్రమంలో అనంతలక్ష్మి చురుగ్గా పాల్గొంటూ ఉత్తమ వలంటీర్‌గా గుర్తింపు పొందింది. ఆమెకు ఈ పురస్కారం దక్కటంపై మండల మహిళా సమాఖ్య, బొమ్ములూరు గ్రామ మహిళా సమాఖ్య సభ్యులు అభినందనలు తెలియజేశారు.

దోమల నివారణ మందు పిచికారీ



ఉప్పలూరులో ఫాగింగ్ పనులు చేస్తున్న వైద్య ఆరోగ్య, పంచాయతీ సిబ్బంది




దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్న సర్పంచి బడుగు బాలమ్మ

బుద్ధవరం(గన్నవరం): మండలంలోని బుద్ధవరం గ్రామ పంచాయతీ పరిధిలో దోమల నివారణ చర్యలు చేపట్టారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మాలాథియాన్ మందు పిచికారీ పనులను మంగళవారం సర్పంచి బడుగు బాలమ్మ ప్రారంభించారు. అనంతరం దావాజిగూడెంలోని రమణమ్మ చెరువు, ఎస్సీ ఏరియా, ప్రభుత్వ హాస్టల్స్ ప్రాంతాల్లో దోమల నిర్మూలన మందులు చల్లించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ సీజనల్ ఇతర వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా ముందస్తుగా పారిశుద్ధ్య చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పాల కేంద్రం అధ్యక్షుడు గొంది నరేంద్ర, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు: దోమల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మలేరియా సబ్ యూనిట్ అధికారి జీవీవీ శ్రీనివాసరావు అన్నారు. ఉప్పలూరు గ్రామ పంచాయతీ పరిధిలో పంచాయతీ, వైద్య ఆరోగ్యశాఖల సంయుక్త ఆధ్వర్యంలో దోమల నిర్మూలన చర్యలు మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామంలో డోర్ టు డోర్ ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నామన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా దోమల నిర్మూలన చర్యలు తీసుకున్నామన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ లాం సోనియా, కార్యదర్శి బి.వెంకటేశ్వరరావు, ఎంపీహెచ్ఈఓ కృష్ణారావు, హెల్త్ సూపర్‌వైజర్ సుధాకర్, లాం సురేష్, హెల్త్‌అసిస్టెంట్లు రాచమళ్ల శ్యాంప్రసాద్, కెనడీబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఇంజినీరింగ్ కాలేజీలో హ్యాకథాన్ సెమీ ఫైనల్స్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కాలేజీ డైరెక్టర్ రవిప్రసాద్, ప్రిన్సిపాల్ కడియాల రవి

పెనమలూరు: గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో బుధవారం హ్యాకథాన్ సెమీఫైనల్స్ నిర్వహించనున్నారు. ఈమేరకు కాలేజీలో మంగళవారం పోస్టర్లను ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కడియాల రవి, అకడమిక్ డైరెక్టర్ రవిప్రసాద్ వివరాలు వెల్లడించారు. ఏపీ స్టేట్‌కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. జేఎన్‌టీయుకే కాకినాడ ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్‌కె.ప్రసాద్ ప్రారంభిస్తారని తెలిపారు. ఆదిత్య యూనివర్సిటీ ఉపకులపతి ఎంబీ.శ్రీనివాస్ కూడా గౌరవ అతిథిగా పాల్గొంటారు. కృష్ణా, గంటూరు, ప్రకాశం ఉమ్మడి జిల్లాల్లో 30 కాలేజీల నుంచి 60 జట్లు పాల్గొంటాయని వివరించారు. ఐబీఎం, బిట్స్ పిలాని నుంచి వచ్చిన నిపుణులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారు. ఈ పోటీల్లో విజేతలకు రూ.1.50 లక్షల విలువైన బహుమతులు అందజేస్తామని చెప్పారు.

కోతులమూక దాడిలో వ్యక్తికి గాయాలు

నున్న(విజయవాడరూరల్): కోతులమూక దాడిలో దేవగిరి రంగారెడ్డి అనే వ్యక్తి గాయపడి చికిత్స పొందుతున్న సంఘటన మంగళవారం నున్న గ్రామంలో చోటుచేసుకొంది. నున్న గ్రామం బ్రాహ్మణ బజారులో నివాసం ఉంటున్న రంగారెడ్డి అనారోగ్యంతో ఇంటి వద్దే వాకింగ్ చేసుకొంటూ ఉన్నాడు. వెనుక వైపు నుంచి వచ్చిన కోతులను గద్దించే సమయంలో మీదపడి గాయపర్చినట్లు బాధితుడు తెలిపాడు. వైద్యుల సూచనల మేరకు ముస్తాబాదులోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్స పొందుతున్నాడు. మందలకు మందలుగా కోతులు ఇళ్లల్లోకి రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కోతుల బెడద నుంచి రక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.